సాక్షి
విశాఖపట్నం
మంగళవారం ; 23 ; ఏప్రిల్ ; 2024



28, 29 తేదీల్లో విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టోర్నీ 8లో



ఆధునిక సాగుతో మెరుగైన ఫలితాలు 8లో

మట్టిని రక్షించండి

మట్టిని రక్షించి.. భవిష్యత్తు తరాలను కాపాడాలని ఇషా ఫౌండేషన్ వలంటీర్ సుబ్రహ్మణ్యం కోరారు. 8లో





బస్సు యాత్రకు దిష్టి తీస్తున్న మహిళలు

సూపర్ హిట్

ఉమ్మడి విశాఖలో సీఎం జగన్ బస్సుయాత్రతో వైఎస్సార్ సీపీలో జోష్

జనమే జనం.. పోటెత్తిన అభిమాన ప్రవాహం.. రోడ్లకిరువైపులా జనం బారులు.. మహిళల హారతులు.. పూలవర్షాలతో కనీవినీ ఎరుగని అఖండ స్వాగతం నడుమ మధ్య సాగిన సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర ఉమ్మడి విశాఖ జిల్లాలో సూపర్‌హిట్ అయింది. సార్వత్రిక ఎన్నికల ముంగిట్లో బస్సుయాత్ర వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. అడుగడుగునా అశేష జనవాహిని నడుమ సాగిన బస్సుయాత్ర ప్రతిపక్ష పార్టీల గుండెల్లో వణుకు పుట్టించింది. సంక్షేమ రథసారథి.. పేదల పెన్నిధి.. తమకు మంచి చేసిన జననేతను దగ్గరి నుంచి చూడాలని.. వీలైతే మాట్లాడాలని.. ఒక్క ఫొటో తీసుకోవాలని ప్రజలు ఉత్సాహం చూపించగా.. ఆయనే స్వయంగా బస్సు దిగి ఆప్యాయంగా పలకరించడం.. 'నేను ఉన్నానంటూ' భరోసా కల్పించడంతో శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. ఉమ్మడి విశాఖలో గెలుపుపై ధీమా పెంచింది.



అక్కయ్యపాలెం వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్ (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి విశాఖలో అడుగుపెట్టింది మొదలు ప్రజలు అదే ప్రేమాభిమానాలు కురిపించారు. జై జగన్ అంటూ నినదించారు. పేదల ప్రతినిధికి జేజేలు పలికారు. ఆయన మాట ఇచ్చాడంటే తప్పడంతే అని నమ్మిన ప్రజలు స్వచ్ఛందంగా జగనన్న చూసేందుకు తరలివచ్చారు. జగనన్న మాటకు.. బాటకు ప్రజలు విలువ ఇస్తున్నారు. ఆయన ఒక్క అడుగు వేస్తే.. లక్షలాది పాదాలు ఆయనను అనుసరించాయి. అందుకే మేమంతా సిద్ధం బస్సుయాత్ర జనజాతర తలపించింది. ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది.

- మేమంతా సిద్ధం అంటూ నినదించిన ప్రజానీకం
- కార్యకర్తలు, నాయకుల్లో కొత్త ఉత్సాహం
- కార్యనిర్వాహక రాజధానికి ఓటేస్తామంటూ చాటిచెప్పిన జనం
- ప్రతి నియోజకవర్గంలోనూ స్వచ్ఛందంగా కదిలివచ్చిన ప్రజలు

అక్కున చేర్చుకున్న జనం

'ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించి.. ఇక్కడే ప్రమాణస్వీకారం చేస్తా. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా అభివృద్ధి చేస్తూ.. ఇక్కడి నుంచే పరిపాలన సాగిస్తానంటూ ఇటీవల జరిగిన విజన్ విశాఖ సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు.. అందుకే అన్నొస్తేనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమని విశాఖ జనం విశ్వసించారు'.. మేము సిద్ధం యాత్రలో భాగంగా జనంతో మమేకమయ్యేందుకు విశాఖ చేరుకున్న వైఎస్ జగన్‌కు విశేష ఆదరణ లభించింది. 2019 ప్రజా సంకల్ప యాత్రలో ఎలాగైతే జనం అక్కున చేర్చుకున్నారో అంతకు మించిన అభిమానాన్ని ఉమ్మడి విశాఖ ప్రజలు మేమంతా సిద్ధం అంటూ చూపిస్తున్నారు.

సభలో స్పందన భేష్

బస్సుయాత్రలో భాగంగా ఈ నెల 20న అనకాపల్లి జిల్లా చింతలపాలెంలో నిర్వహించిన సిద్ధం సభకు వార్ వన్‌సైడ్ అనే రీతిలో అనూహ్య స్పందన లభించింది. ముఖ్యంగా యువత, మహిళలు సీఎం వైఎస్ జగన్ మాటలకు కేరింతలు కొట్టారు. జగన్ వెంట మేమంటూ నినాదాలు చేశారు. ఈ ఎన్నికల్లో కూటమి కుయుక్తులు, చంద్రబాబు చెబుతున్న అబద్ధాల గురించి జగన్ చెప్పిన మాటలు ప్రజల్లోకి సూటిగా వెళ్లడంతో టీడీపీ, జనసేన పార్టీల వైఖరిపై ప్రజల్లో ఒక క్లారిటీ తీసుకొచ్చారు.

జనమంతా జేజేలు


అనకాపల్లి, విశాఖ జిల్లాలో బస్సుయాత్రకు వచ్చిన ఆదరణతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం రెట్టింపైంది. ఈసారీ జెండా రెపరెపలాడేలా జనమంతా జేజేలు పలుకుతుండటంతో.. అటు అభ్యర్థులు, పార్టీ శ్రేణులు దూకుడు పెంచారు. ఇంటింటా ప్రచారాన్ని మరింత ఉత్సాహంగా చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ విజయ ఢంకా మోగబోతోందన్నది స్పష్టమైంది.

ప్రతిపక్షాల్లో వణుకు

జనమంతా జగన్‌వైపే ఉన్నారన్న స్పష్టత రావడంతో ప్రతిపక్షాల్లో వణుకు మొదలైంది. ప్రజలంతా స్వచ్ఛందంగా జగన్‌ను చూసేందుకు వచ్చిన విషయం తెలుసుకొని టీడీపీ, జనసేన నేతలు కలవరపడుతున్నారు. ఫ్యాన్ గాలికి తట్టుకొని నిలబడటం కష్టమేనన్న సంకేతాలు కనిపించడంతో ఏం చేయాలో పాలుపోక ఆపసోపాలు పడుతున్నారు. గెలుపు అవకాశాలు కనుచూపు మేరలో కూడా కనిపించకపోవడంతో ప్రజలను ఎలా ప్రసన్నం చేసుకోవాలన్నదానిపై పునరాలోచనలో పడేలా బస్సుయాత్ర జైత్రయాత్రలా సాగింది. ఉమ్మడి విశాఖలో మేమంతా సిద్ధం బస్సుయాత్ర కనీవినీ ఎరుగని రీతిలో సూపర్ హిట్ అవ్వడంతో ఫ్యాన్ స్పీడ్ మరింత పెరిగింది. అధినేత పర్యటనతో అనకాపల్లి, విశాఖ జిల్లాలోని అభ్యర్థులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ విద్యార్థులు
టాప్ లేపారు

- 10వ తరగతిలో మెరుగైన ఫలితాలు
- గతేడాది కంటే గణనీయంగా పెరిగిన ఉత్తీర్ణత
- జిల్లాలో 91.15 శాతం మంది విద్యార్థుల ఉత్తీర్ణత
- 21,998 మంది విద్యార్థులకు ప్రథమ శ్రేణి మార్కులు
- ఫస్ట్‌క్లాస్‌లు సాధనలో రాష్ట్రంలో జిల్లాకు నాల్గోస్థానం
- కేజీబీవీల్లో శతశాతం ఫలితాలు



విశాఖ విద్య: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. గతేడాది కంటే ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది. సోమవారం పదో తరగతి ఫలితాలు ప్రకటించారు. జిల్లాలో ఈ ఏడాది 25,299 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. వీరిలో 25,794 మంది పాసయ్యారు. ఈ ఏడాది 91.15 శాతం ఉత్తీర్ణత నమోదైంది. తద్వారా రాష్ట్ర సూచికలో జిల్లా 9వ స్థానం కైవసం చేసుకుంది. గతేడాది 82.68 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈ ఏడాది ఉత్తీర్ణత గణనీయంగా పెరిగింది. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాల బోధన సాగడంతో పాటు కలెక్టర్ మల్లికార్జున సూచనలకు అనుగుణంగా డీఈవో ఎల్. చంద్రకళ వంద రోజుల కార్యాచరణ అమలు చేశారు. నాణ్యమైన విద్య అందించేలా తగిన పర్యవేక్షణ చేయడంతోనే ఇది సాధ్యమైందని విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు.

మార్కులతో మెరిశారు

జిల్లాలో ఈ ఏడాది 10వ తరగతి పాసైన వారిలో



కేఎస్ఎం హైస్కూల్ విద్యార్థిని భారతి(591)ని అభినందిస్తున్న ఎంఈవో బాలమణి, హెచ్ఎం రాము



ఎస్.యోగేశ్వరి (589), కప్పరాడ జీవీఎంసీ హైస్కూల్



పి.కీర్తి మేఘన (589), జెడ్పీ బాలిక పాఠశాల, గోపాలపట్నం



బందారు నైమిష (588), ఏపీ బాలికల గురుకుల పాఠశాల, భీమిలి



దూడ రఘు (588), జెడ్పీ పాఠశాల, వాడచీపురుపల్లి

21,998 మంది ఫస్ట్‌క్లాస్ మార్కులు సాధించారు. ఫస్ట్ క్లాస్ మార్కులు సాధనలో జిల్లా నాల్గో స్థానంలో నిలిచింది. సెకండ్ క్లాస్ మార్కులతో 2,620 మంది, థర్డ్ క్లాస్ మార్కులతో 1,176 మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా ఈ ఏడాది ఉత్తీర్ణత శాతంలో బాలుర కంటే బాలికలే పై చేయిగా నిలిచారు. బాలురు 14,932 మంది పరీక్షలు రాయగా.. వీరిలో 13,449 మంది (90.07 శాతం) పాసయ్యారు. బాలికలు 13,367 మంది పరీక్షలు రాయగా వీరిలో 12,345 మంది(92.35శాతం) ఉత్తీర్ణులయ్యారు.

ప్రభుత్వ స్కూళ్ల సత్తా

10వ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లకు మించి ఉత్తీర్ణత నమోదైంది. జిల్లాలోని మూడు కస్తూరి గాంధీ

మిగతా 8లో ▶

అట్టహాసంగా బొత్స ఝాన్సీ నామినేషన్



కలెక్టర్ మల్లికార్జునకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, చిత్రంలో పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్స, మేయర్ హరి వెంకట కుమారి, దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్



వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీకి ఆల్ ద బెస్ట్ చెబుతున్న పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, నేతలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం పార్లమెంట్ స్థానానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జునకు ఆమె తన నామినేషన్ పత్రాలు అందించారు. ఝాన్సీ నామినేషన్‌ను విశాఖ మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జామి జెడ్పీటీసీ సభ్యులు గొర్ల సరయు ప్రతిపాదించారు. ముందుగా ఎండాడలో మేమంతా సిద్ధం రాత్రి బస శిబిరం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంత్రి బొత్స సత్యనారాయణ, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం లాసన్స్ బే కాలనీలోని కార్యాలయంలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు వైఎస్సార్ సీపీ శ్రేణులతో బైక్‌ర్యాలీగా వీఎంఆర్డీఏ పార్కు, వైఎంసీఏ, ఆర్కే బీచ్, కోస్టల్ బ్యాటరీ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీ లక్ష్మి, ఆమె కుమార్తె బొత్స అనూష నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్, ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంవీవీ సత్యనారాయణ,ముత్తంశెట్టి శ్రీనివసరావు, కె.కె.రాజు, వాసుపల్లి గణేష్ కుమార్, ఆడారి ఆనంద్‌కుమార్, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మండలి విప్ వరుదు కల్యాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, మాజీ మంత్రి బాలరాజు పాల్గొన్నారు.

విశాఖ రాజధాని కావాలంటే సీఎం జగన్ గెలవాలి

నామినేషన్ అనంతరం కలెక్టర్ కార్యాలయం బయట బొత్స ఝాన్సీ మీడియాతో మాట్లాడారు. విశాఖ పరిపాలన రాజధాని కావాలన్నా.. ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలన్నా.. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగాలన్నా.. విశాఖకు రైల్వే జోన్ కావాలన్నా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలి.. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలవాలన్నారు. బస్సు యాత్రలో భాగంగా నగరానికి వచ్చిన సీఎం జగన్‌కు వేలాదిగా తరలివచ్చిన జనం అడుగడుగునా ఘనస్వాగతం పలికారన్నారు. ఇదే ఉత్సాహంతో మే 13న ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థిగా తనను, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నామినేషన్‌కు తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ పరిశీలకుడు మళ్ల విజయప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, ఎస్.ఎ.రెహమాన్, డిప్యూటీ మేయర్లు కె.సతీష్, జియ్యాని శ్రీధర్, నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బానాల శ్రీనివాస్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విద్యావంతురాలు బొత్స ఝాన్సీ

మహారాణిపేట: వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న బొత్స ఝాన్సీ విద్యావంతురాలు. 2001లో ఎంఏ ఫిలాసఫీ పూర్తి చేసిన ఝాన్సీ, 2009లో ఫిలాసఫీలో పీహెచ్‌డీ కూడా పూర్తి చేశారు. ఝాన్సీకి మొత్తం రూ.19.75 కోట్ల ఆస్తులున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో ఝాన్సీ పేరిట రూ.9.22 కోట్లు, బొత్స సత్యనారాయణ పేరిట రూ.10.53 కోట్లు స్థిర, చరాస్తులున్నట్లు వెల్లడించారు. మొత్తంగా రూ.2.51 కోట్లు అప్పులున్నట్లు అందులో పేర్కొన్నారు.

విశాఖ ఎంపీ స్థానానికి ఐదు నామినేషన్లు

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విశాఖ పార్లమెంట్ స్థానానికి సోమవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. వివిధ పార్టీల నుంచి అభ్యర్థులు ఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జునకు ఏడు సెట్ల పత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి మూడు సెట్లు, బొత్స అనూష ఓ సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వోకి సమర్పించారు. బొత్స ఝాన్సీ వెంట వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్.. అనూష వెంట గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఉన్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థిగా మతుకుమిల్లి శ్రీ భరత్, మతుకుమిల్లి తేజస్విని ఒక్కో సెట్, సమాజ్‌వాదీ పార్టీ నుంచి జాలాది విజయకుమారి రెండో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వోకి సమర్పించారు.

అసెంబ్లీకి 22 నామినేషన్ల దాఖలు

మహారాణిపేట: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సోమవారం 22 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆయా నియోజకవర్గాల ఆర్వోలు అభ్యర్థుల నుంచి 28 సెట్ల నామినేషన్ పత్రాలను స్వీకరించారు.

- భీమిలి నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ నుంచి గోపాలరావు ఓ సెట్, స్వతంత్ర అభ్యర్థిగా మరో సెట్, నందికోళ్ల సత్య స్వతంత్ర అభ్యర్థినిగా ఓ సెట్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి అడ్డాల స్వప్న ఓ సెట్, అడ్డాల వెంకట వర్మరాజు రెండు సెట్లు ఆర్వోకి సమర్పించారు.
- తూర్పు నియోజకవర్గంలో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. భారత చైతన్య యువజన పార్టీ తరఫున యడ్ల వేణుగోపాల కృష్ణ, స్వతంత్ర అభ్యర్థినిగా ఆదాడ రమణి, టీడీపీ తరఫున వెలగపూడి రామకృష్ణబాబు, వెలగపూడి సుజన రెండో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వోకి అందించారు.
- దక్షిణ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా లగిశెట్టి తారకరాం, కంబేటి శ్రీదేవి ఒక్కో సెట్, కడగల ఈశ్వరరావు మూడు, బహుజన సమాజ్ పార్టీ నుంచి కదిరి రాము రెండు సెట్లు సమర్పించారు.
- ఉత్తర నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ నుంచి పెద్దాడ కనకమహాలక్ష్మి రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థినిగా ముమ్మనేని సరోజని, జాతీయ జనసేన పార్టీ నుంచి పి.జగదీశ్, స్వతంత్ర అభ్యర్థినిగా ఎలమంచిలి సాహితి నామినేషన్లు దాఖలు చేశారు.
- పశ్చిమ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా హనుమంతు శివ చాణక్య దొర నామినేషన్ వేశారు.
- గాజువాకలో స్వతంత్ర అభ్యర్థిగా కాండ్రేగుల ఆదినారాయణ, బహుజన సమాజ్ పార్టీ నుంచి నందికోళ్ల అప్పారావు, సీపీఐ(ఎం) తరఫున మరడాన జగ్గనాయుడు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వోకు సమర్పించారు.
- పెందుర్తి నియోజకర్గంలో నేషనలిస్టు జనశక్తి పార్టీ నుంచి ఏలూరు వెంకట రమణ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఈత రోజా ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు.

నేడు 21వ రోజు
మేమంతా సిద్ధం బస్సు యాత్ర

ఉదయం 9 గంటలకు ఎండాడ రాత్రి బస శిబిరం వద్ద ప్రారంభం

సాక్షి, విశాఖపట్నం: మేమంతా సిద్ధం బస్సుయాత్ర 21వ రోజు మంగళవారం ఉదయం 9 గంటలకు ఎండాడ రాత్రి బస నుంచి బయలుదేరుతుంది. మధురవాడ, మారికవలస, గంభీరం మీదుగా 10.30 గంటలకు ఆనందపురం వద్ద గల చెన్నా కన్వెన్షన్ వద్దకు చేరుకుంటుంది. అక్కడ 11.30 గంటల వరకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశమవుతారు. అనంతరం బయలుదేరి తగరపువలస మీదుగా విజయనగరం జిల్లాకు బస్సు యాత్ర చేరుకుంటుంది. విజయనగరం జిల్లా జొన్నాడ వద్ద లంచ్ ఉంటుంది. అనంతరం విజయనగరం జిల్లా చెల్లూరులో నిర్వహించే బహిరంగ సభలో సీఎం జగన్ పాల్గొంటారు. తర్వాత చింతలవలస, సవరవిల్లి, భోగాపురం, పూసపాటిరేగ, పైడిభీమవరం, రణస్థలం, బుడమూరు మీదుగా అక్కివలస వద్ద రాత్రి బస పాయింట్‌కు బస్సు యాత్ర చేరుకుంటుంది.

పోస్టల్ బ్యాలెట్ గడువు ఈ నెల 26

మహారాణిపేట: ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం ఈ నెల 26వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫారం-12 దరఖాస్తుకు ఎన్నికల గుర్తింపు కార్డు, ఎన్నికల విధుల నియామక పత్రం జత చేసి నోడల్ అధికారి ద్వారా వారు పని చేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని సూచించారు.

సహాయ రిటర్నింగ్ అధికారులు వివరాలు

పోస్టల్ బ్యాలెట్ పత్రాల కోసం జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని కలెక్టర్ వివరించారు. భీమిలి నియోజకవర్గంలో ఆనందపురం తహసీల్దార్ హేమంత్ కుమార్ (88822 49999), విశాఖ తూర్పు నియోజకవర్గంలో భీమిలి డివిజనల్ డెవలప్‌మెంటు అధికారి లక్ష్మీపతి (88972 20999), విశాఖ దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక తహసీల్దార్ (భూ పరిరక్షణ) భుజంగరావు (98665 32438), విశాఖ ఉత్తర నియోజకవర్గంలో సీతమ్మధార తహసీల్దార్ జి.శ్రీరామ్మూర్తి (99480 78502)కు పూర్తి చేసిన దరఖాస్తులను సమర్పించాలని కోరారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ములగాడ తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా (95508 20099), గాజువాక అసెంబ్లీ నియోజకవర్గంలో పెదగంట్యాడ తహసీల్దార్ భాస్కరరావు(79892 30277), పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో సబ్బవరం తహసీల్దార్ చలమయ్య(77804 52956)కు అందించాలని సూచించారు.

హోమ్ ఓటింగ్ దరఖాస్తుకు నేడు ఆఖరు తేదీ

హోమ్ ఓటింగ్ కోసం ఈ నెల 23వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, 40 శాతం వైకల్యం గల దివ్యాంగులను హోమ్ ఓటింగ్‌కు అర్హులుగా సర్వే ద్వారా గుర్తించి, వారికి ఫారం నం.12(డి) అందించినట్లు ప్రకటనలో తెలిపారు. ఓటర్లు ఇంకెవరైనా మిగిలి ఉంటే మంగళవారంలోగా అసెంబ్లీ నియోజకవర్గ రిటరింగ్ అధికారికి వ్యక్తిగతంగా దరఖాస్తు చేయాలని సూచించారు. జిల్లాలో 16 వేల మంది వృద్ధులు, 8 వేల మంది దివ్యాంగులు ఉంటారని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. త్వరలో తేదీలను నిర్ణయించి వీడియో గ్రాఫర్‌తో కూడిన ప్రత్యేక పోలింగ్ అధికారుల బృందం ద్వారా ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే సౌకర్యం కల్పిస్తున్నామని తెలియజేశారు.

వసూళ్ల పర్వం..!

- బిల్డర్ల నుంచి భారీగా దండుకుంటున్న వైనం
- టార్గెట్ పెట్టి మరీ వసూళ్లు
- ఆ నగదుతో నేతల కొనుగోలు
- విశాఖ జిల్లాలో ఓ టీడీపీ నేత వ్యవహారం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

సాధారణంగా ఎన్నికలు అనగానే నేతలు భారీగా ఖర్చు చేయడం చూస్తుంటాం. కానీ ఆయన మాత్రం ఎన్నికలు అనగానే వసూళ్లకు తెగబడుతున్నారు. గతంలో తనకున్న పాత పరిచయాలు, అధికారంలో ఉన్నప్పుడు చేసిన మేలు గుర్తుచేస్తూ టార్గెట్లు పెట్టి మరీ బిల్డర్ల నుంచి వసూళ్లకు దిగుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఓ బిల్డర్ సుమారు రూ.5 కోట్ల మేర సమర్పించుకున్నట్టు సమాచారం. ఈ నగదుతోనే ఆయన నేతలను ప్రలోభాలకు గురిచేస్తూ పార్టీలో చేర్చుకుంటున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం పోటీ చేస్తున్న నియోజకవర్గంలో గతంలో ఆయన గెలుపొందారు. ఆ సమయంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించలేదు. అయితే రియల్‌ఎస్టేట్ వర్గాలకు మాత్రం ఇష్టారీతిలో మేలు చేకూర్చారు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో తనకు నిధులు సమకూర్చాలంటూ రియల్ ఎస్టేట్ వర్గాలను సదరు టీడీపీ నేత పిలిచి మరీ కోరినట్టు తెలుస్తోంది. దీంతో విశాఖ నగర శివారులో ఉన్న పలువురు రియల్టర్లు ఆ నేతను కలిసి



నిధులు ముట్టచెబుతున్నట్టు సమాచారం. ఈ నిధులతో ఇష్టారీతిలో పలువురు నేతల తలలకు ధర నిర్ణయించి మరీ జాయినింగ్స్ చేసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది.

అక్రమాలకు సై.. అభివృద్ధికి నై..!

వాస్తవానికి ఎన్నికలు వచ్చేసరికి నియోజకవర్గాలు మారే సదరు నేత ఈసారి మాత్రం గతంలో తాను పోటీ చేసిన నియోజకవర్గంలోనే మరోసారి బరిలో నిలిచారు. గతంలో నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన సమయంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించలేదు. పర్యాటకంగా ఎంతో పేరొందిన సదరు నియోజకవర్గంలో పర్యాటకరంగ అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అధికారంలో ఉన్న సమయంలో కేవలం అక్రమాలకు ఇష్టారీతిలో సహకరించారు. ప్రధానంగా రెవెన్యూ అధికారులను అడ్డం పెట్టుకుని భారీగా భూములను అక్రమంగా కాజేశారు. రికార్డులను సైతం తారుమారు చేసి అక్రమాలకు తెరలేపారు. ఈయన దెబ్బకు పలువురు రెవెన్యూ అధికారులు సైతం ఉద్యోగాలను కోల్పోవాల్సి వచ్చింది. అంతే కాకుండా ఇప్పటికీ అనేక విచారణలను ఎదుర్కొంటున్నారు. అయితే, భూరికార్డులను మార్చడం ద్వారా లబ్ధి పొందిన రియల్టర్లను ఇప్పుడు ఆయన తన వద్దకు పిలిపించుకుంటున్నారు. మరోసారి తాను ఎమ్మెల్యేగా గెలిస్తే మరింత ఇష్టారాజ్యంగా అక్రమాలకు సహకరిస్తానని చెబుతూ వసూళ్లకు తెగబడుతున్నారు. ఇప్పటికే పలువురు రియల్టర్లు సదరు నేతలకు భారీగానే నిధులు ముట్టచెప్పారు. దీంతో ఈ నగదుతో సర్పంచుకు రూ.2 లక్షల నుంచి రూ. 5 లక్షలు, ఎంపీటీసీలకు రూ. 5 లక్షల నుంచి రూ.7 లక్షలు, జెడ్పీటీసీలకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు ఇలా రేటు కట్టి మరీ పార్టీలోకి చేర్చుకుంటున్నట్టు తెలుస్తోంది.

ఆయన్ని నమ్మేదెలా?

వాస్తవానికి ఈయన అభ్యర్థిత్వంపై నియోజకవర్గంలో సాధారణ ప్రజానీకానికి ఎటువంటి సదాభిప్రాయం లేదు. గెలిచిన తర్వాత నియోజకవర్గాన్ని ఏ మాత్రం పట్టించుకోరని.. ఎటువంటి అభివృద్ధి చేయరని.. ఆ తర్వాతి ఎన్నికల్లో మరో నియోజకవర్గానికి మకాం మారుస్తారన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో చేరికల ద్వారా తనమీదున్న దురాభిప్రాయంపై చర్చ జరగకుండా జాగ్రత్త పడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆయన్ని కలిసేందుకు వచ్చినవారిని గంటలు గంటలు సమయం వేచిఉంచడం, ఆయన పీఏ అక్రమ వ్యవహారాలన్నింటిలోనూ ఇప్పటికే అనుభవంలో ఉన్న నియోజకవర్గ ప్రజలు మాత్రం ఈ చేరికలను సీరియస్‌గా తీసుకోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆతిథ్య రంగానికి పారిశ్రామిక హోదా కల్పించాలి

సీఎం జగన్‌కు ఏపీ టూరిజం ఫోరం విజ్ఞప్తి



సీఎం వైఎస్ జగన్‌కు వినతిపత్రం అందిస్తున్న టూరిజం ఫోరం ప్రతినిధి పవన్ కార్తీక్

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ఆతిథ్య రంగానికి పారిశ్రామిక హోదా కల్పించేలా ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని ఏపీ టూరిజం ఫోరమ్ కార్యదర్శి, విశాఖ ఎయిర్ పోర్ట్ అథారిటీ సలహా కమిటీ సభ్యులు ఎంపీ పవన్ కార్తీక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా విశాఖలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఆయన వినతి పత్రం అందించారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమక్షంలో ముఖ్యమంత్రికి ఫోరం తరఫున వినతి పత్రం అందించి విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో విశాఖ టూరిజం, హాస్పిటాలిటీ రంగాల్లో దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచేందుకు పుష్కలమైన అవకాశాలు న్నాయని పవన్‌కార్తీక్ అన్నారు.

బొగ్గు సంక్షోభం పరిష్కారానికి సహకరించండి

స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు ప్రస్తుతం ఉన్న తీవ్రమైన బొగ్గు సంక్షోభాన్ని పరిష్కరించడంలో వాటాదారులందరూ సహకరించాలని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ కోరారు. దేశంలోని అనేక ప్రతిష్టాత్మక కట్టడాలు, ప్రాజెక్టుల నిర్మాణంలో స్టీల్ ప్లాంట్ ఉత్పత్తులు కీలకపాత్ర పోషించాయన్నారు. అయితే ఈనెల 12 నుంచి అదానీ గంగవరం పోర్టు నుంచి రవాణా నిలిచిపోవడం వల్ల స్టీల్‌ప్లాంట్ తీవ్రమైన సవాళ్లు ఎదుర్కొంటోందన్నారు. ఉత్పత్తి ప్రక్రియకు అవసరమైన కోకింగ్ కోల్, సున్నపురాయి అందకపోవడం ప్లాంట్ సామర్థ్యంపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. ఈ అత్యవసర సమయంలో ప్లాంట్‌కు వాటాదారులు, ప్రజాప్రతినిధులు, కార్మికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ విద్యార్థులు టాప్ లేపారు

▶ 7వ పేజీ తరువాయి

విద్యాలయాల్లో 114 మంది పరీక్షలు రాయగా, వీరిలో 113 మంది పాసయ్యారు. 99.12 శాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. భీమునిపట్నం, పద్మనాభం కేజీబీవీల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయి. బీసీ వెల్ఫేర్, ఏపీఆర్ఎస్ స్కూళ్లలో 98 శాతం ఫలితాలు వచ్చాయి. సోషల్ వెల్ఫేర్‌లో 97.10 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని స్కూళ్లలో 96 శాతం ఉత్తీర్ణత సాధించగా, అంతకు మించి ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఉత్తీర్ణత సాధించడం విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయనడానికి నిలువెత్తు నిదర్శనం.

రీ వెరిఫికేషన్‌కు అవకాశం

ఫలితాలపై విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉన్నట్లైతే రీ-కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ వెల్లడించారు. మంగళవారం నుంచి ఈ నెల 30 వరకు రీ- కౌంటింగ్ కోసం ఒక్కో పేపర్‌కు రూ.500లు, రీ-వెరిఫికేషన్‌కు ఒక్కో పేపరకు రూ.1000 చెల్లించాలని పేర్కొన్నారు. మే 24 నుంచి జూన్ 3 వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నందున.. ఫెయిలైన విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోగా ఫీజు చెల్లించాలన్నారు.

సమష్టి కృషి ఫలితం

జిల్లాలో గతేడాది కంటే 8.47 శాతం ఉత్తీర్ణత పెరుగుదల ఉండటం మంచి పరిణామమని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో కూడా మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు. మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయుల అందరి సమష్టి కృషి ఫలితంగానే ఇది సాధ్యమైందన్నారు.



భరత్ (586), ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్



పిక్కి వినోద్ (586), సరవ బీసీ రెసిడెన్షియల్ పాఠశాల



జి.తేజేష్(584), మాధవధార ఉన్నత పాఠశాల



వన సాహితిని సత్కరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి

పార్వతీపురం మన్యం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పదో తరగతి ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడంపై ఆర్జేడీ బి.వి జయ్‌భాస్కర్ హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిభకు సత్కారం

అగనంపూడి: అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వన సాహితి పదో తరగతిలో 584 మార్కులు సాధించింది. ఆమెను విశాఖ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్ఎం కృష్ణారావు, కమిటీ చైర్మన్ బంధం అప్పలరాజు, కమిటీ ప్రతినిధులు బేతా అనిత, అట్టా శ్రీను, రమాదేవి, లత, సైకియాదేవి తదితరులు పాల్గొన్నారు.



హేమంత్‌ను అభినందిస్తున్న బాలభాను పాఠశాల నిర్వాహకులు

కూలీ కుమారుడు సత్తా

మురళీనగర్: పదో తరగతి ఫలితాల్లో దినసరి కూలీ కుమారుడు సత్తా చాటాడు. మురళీనగర్ సెక్టార్-8లోని బాలభాను పాఠశాలలో చదువుతున్న రెడ్డి హేమంత్ 596 మార్కులు సాధించాడు. విద్యార్థి తండ్రి నాగభూషణం, తల్లి సత్యవతి దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. పాఠశాల చైర్మన్ ఎస్ఎన్ రాజు, కరస్పాండెంట్ బీఆర్‌కే రాజు, ప్రిన్సిపాల్ శుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ మనోరమణి విద్యార్థిని అభినందించారు.

టీచర్ల ప్రోత్సాహంతోనే సాధించా..

మా నాన్న తోపుడు బండిపై పండ్లు అమ్ముతుంటారు. అమ్మ గృహిణి. 10వ తరగతిలో 591 మార్కులు సాధించడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో చాలా మార్పులు వచ్చాయి. విద్యా విధానం చాలా బాగుంది. ఉపాధ్యాయులు చక్కగా ప్రోత్సహించారు. ప్రత్యేక క్లాసులతో ఎప్పటికప్పుడు ఎంతో సహాయం చేశారు. ఈ మార్కులు సాధించానంటే అది కేవలం టీచర్ల ప్రోత్సాహం, మా తల్లిదండ్రుల సహకారంతోనే. భవిష్యత్‌లో ఇంజినీరింగ్ చేయాలని ఉంది. ఇందుకోసం ఇంటర్ లేదా డిప్లమోలో చేరుతా..

– రాయల భారతి, కేఎస్ఎం బాలికల హైస్కూల్, రైల్వే న్యూకాలనీ

ఐఏఎస్ కావడమే నా లక్ష్యం

కలెక్టర్ కావాలనే లక్ష్యంతో చదువుతున్నాను. అమ్మ,నాన్న ఆకాంక్షను నెరవేర్చుతాను. అయితే వారికి భారం కాకుండా.. బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించిన తర్వాత సివిల్స్‌కు ప్రిపేర్ అవుతాను. ఈ లోగా సివిల్స్ సబ్జెక్ట్‌పై పట్టు సాధించేందుకు కృషి చేస్తాను. నాన్న ప్రైవేట్ కార్ల షోరూంలో పని చేస్తున్నారు. అమ్మ ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. 10వ తరగతిలో 589 మార్కులు సాధించాను.

– పి.కీర్తి మేఘన, జెడ్పీ బాలిక పాఠశాల, గోపాలపట్నం

కలెక్టర్ అవుతా..

నాకు చదువు అంటే చాలా ఇష్టం. నాన్న బండారు రమణ లారీ డ్రైవర్. అమ్మ ఇంటి వద్ద ఉంటుంది. అమ్మ, నాన్నలిద్దరూ నన్ను ఎంత గానో ప్రోత్సహిస్తున్నారు. వారి ఆకాంక్షలు నెరవేర్చేందుకు బాగా చదివి 10వ తరగతిలో 588 మార్కులు సాధించాను. నా లక్ష్యం ఐఏఎస్. సమాజానికి, నిస్వార్థంగా సేవ చేయాలన్నది నా కోరిక. దాన్ని సాధించడానికి ఇప్పటి నుంచే ఇంకా ఎక్కువ కష్టపడతాను.

– బండారు నైమిష, ఏపీ బాలికల గురుకుల పాఠశాల, భీమిలి

నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తా..

మాది పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం. మత్స్యకార కుటుంబం. నాన్న దూడ దేముడు, సూకమ్మ కూలీలు. అక్క మహేశ్వరి కొమ్మాదిలో బీటెక్ చేస్తోంది. అన్నయ్య మహేష్ కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో చదువుతున్నాడు. 10వ తరగతిలో 588 మార్కులు సాధించడం ఆనందంగా ఉంది. కలెక్టరు కావాలన్నదే నా లక్ష్యం. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తాను.

– దూడ రఘు, వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్

శాస్త్రవేత్త అవుతా



మల్కాపురం జీవీఎంసీ పాఠశాలలో చదువుకుని 588 మార్కులు సాధించాను. భవిష్యత్‌లో గొప్ప శాస్త్రవేత్త కావాలన్నదే నా లక్ష్యం. నోబెల్ సాధించాలన్నది నా కల. నాన్న బంగారం షాపులో పనిచేస్తున్నారు. అమ్మ గృహిణి. తమ్ముడు ప్రశాంత్ 8వ తరగతి చదువుతున్నాడు.

– అల్లు జశ్వంత్, జీవీఎంసీ పాఠశాల, మల్కాపురం

పోలీసు అధికారినవుతా..



మాది బుచ్చెయ్యపేట. వ్యవసాయ రైతు కుటుంబం. నాన్న పాతల శ్రీనివాసరావు రైతు. అమ్మ సుజాత గృహిణి. అక్క వేణు కాకినాడలో డిప్లమో చదువుతోంది. 10వ తరగతిలో 586 మార్కులు సాధించడం ఆనందంగా ఉంది. ఉన్నత చదువులు అభ్యసించి.. పోలీసు అధికారి కావాలన్నదే నా లక్ష్యం.

– పి.దివ్య, తానాం గురుకుల పాఠశాల

సివిల్స్ సాధించడమే లక్ష్యం



నాన్న సతీష్ లారీ డ్రైవర్. అమ్మ రమణమ్మ గృహిణి. అన్నయ్య బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతున్నాడు. నా లక్ష్యం సివిల్స్. సివిల్స్ సాధించి దేశానికి సేవలందిస్తా. పదో తరగతిలో 584 మార్కులు సాధించా.

– మద్దిల రాహుల్, లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్

ఐఐఐటీలో చేరుతా..



బాగా కష్టపడి.. 10వ తరగతిలో 584 మార్కులు సాధించాను. ఉపాధ్యాయుల ప్రోత్సాహం మరువలేను. ఐఐఐటీలో సీటు సాధించి మంచి ఉద్యోగంలో స్థిరపడతా..

– కడియం రత్నసావియా, పదో తరగతి, తోటగరువు హైస్కూల్

ఒత్తిడిని జయించి.. అధిక మార్కులు సాధించి..



తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పదో తరగతిలో 596 మార్కులు సాధించాను. పరీక్షలకు మొదటి రోజు హాజరైనప్పుడు కాస్త భయపడ్డా. ఒత్తిడినంతా పక్కన పెట్టి ప్రశాంతంగా ప్రశ్నలు చదివి.. అన్నింటికీ జవాబులు రాశా. ఇంటర్‌లో ఎంపీసీ గ్రూప్‌లో చేరుతా.. భవిష్యత్‌లో శాస్త్రవేత్తనవుతా.. అమ్మ షేక్ కరిమునీషా బేగం ఏయూలో, నాన్న షేక్ రహీమ్ బాబు నేవల్ డాక్‌యార్డ్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

– షేక్ ఫరిదా జైభా, నారాయణ స్కూల్, ఆశీలమెట్ట

ప్రగతి సారథికే ప్రజలు బ్రహ్మరథం

- కూటమి ఆశలు ఆవిరే..
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయబోమని మోదీతో ప్రకటన చేయిస్తారా..?
- సీఎం బస్సు యాత్రతో విశాఖ ఉప్పొంగింది
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



బీచ్‌రోడ్డు: సీఎం జగనన్న చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రతో విశాఖ ఉప్పొంగింది. సాగర ఘోషకు దీటుగా జనకెరటం తరలి రావడంతో విశాఖలో రెండు సముద్రాలు కనిపించాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.జనం తండోప తండాలుగా తరలివచ్చి ప్రగతి సారథి జగనన్నకు తమ మద్దతు తెలియజేశారన్నారు.

ఫ్యాన్ గాలి జోరు

బస్సుయాత్రతో రాష్ట్రమంతా ఫ్యాన్ గాలి బలంగా వీస్తోందని తేటతెల్లమైందన్నారు. ఈ స్పీడ్ ముందు కూటమి కొట్టుకు పోవడం ఖాయమని ఆమె ఎద్దేవా చేశారు. 175కి 175 స్థానాల్లో వార్ వన్‌సైడ్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

కంచెల్లో బాబు, పవన్ సభలు

మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని తేలడంతో తెలుగుదేశం, జనసేన నేతల్లో ఫ్రస్టేషన్ మొదలైందని ఆక్షేపించారు. దీంతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల ప్రచార సభల్లో జగన్‌మోహన్‌రెడ్డిపై ఇష్టమొచ్చినట్లు నోరుపారేసుకుంటున్నారని దుయ్యబట్టారు. పవన్ కల్యాణ్ మాట్లాడిన తీరు ,హావభావాలు చూస్తే ఎంతగా ఫ్రస్టేషన్‌కు గురవుతున్నారో అర్థమవుతోందన్నారు. ఇనుప కంచెలు ఏర్పాటు చేసుకుని చంద్రబాబు, పవన్ మాట్లాడుతున్న పరిస్థితి చూస్తుంటే జాలేస్తుందని ఎద్దేవా చేశారు. అలాంటి మీరు జగనన్న పరదాల చాటున తిరుగుతున్నారని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు.

ఆ రెండింటిపై మోదీతో ప్రకటన చేయిస్తారా?

చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు రాష్ట్రంపై నిజంగా ప్రేమ ఉంటే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని మోదీతో ప్రకటన చేయించాలని సవాల్ విసిరారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తామని ఎన్నికల ప్రచారంలోనే బీజేపీ పెద్దలతో చెప్పించాలని డిమాండ్ చేశారు. విశాఖలో రైల్వేజోన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం భూమి అప్పగించినా కేంద్రం పెండింగ్‌లో పెట్టిందని.. ఆ అంశంపై కూడా క్లారిటీ ఇప్పించి రాష్ట్ర అభివృద్ధిపై కూటమికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేయాలన్నారు.

చంద్రబాబు పెద్ద సైకో

చంద్రబాబు అంత సైకో రాష్ట్రంలో ఎవరూ లేరని ఆమె మండిపడ్డారు. ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయి తెలంగాణ నుంచి పారిపోయి వచ్చిన చంద్రబాబు బీరాలు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను వదిలేసిన బాబు కంటే పెద్ద సైకో ఎవరుంటారని మండిపడ్డారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఓట్లు అడిగే హక్కు ఒక్క జగనన్నకే ఉందన్నారు. ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు అడుగడుగునా జగన్ మార్కు అభివృద్ధి కనిపిస్తోందన్నారు. రూ.740 కోట్లతో వంశధార నీటిని తీసుకొచ్చి ఉద్దానం కిడ్నీ వ్యాధుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రూ.200 కోట్లతో 200 పడకల కిడ్నీ ఆస్పత్రితో పాటు రీసెర్చ్ సెంటర్ కూడా నెలకొల్పారని చెప్పారు. శ్రీకాకుళంలో మూలపేట పోర్టు, భోగాపురంలో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, ఉత్తరాంధ్రలో 4 మెడికల్ కాలేజీలు, కురుపాంలో ఇంజినీరింగ్ కాలేజీ, విశాఖలో ఇన్‌ఆర్బిట్‌మాల్, ఇన్ఫోసిస్, అదానీ డేటాసెంటర్, రూ.6వేల కోట్లతో ఆరులేన్ల హైవే, టూరిజం ప్రాజెక్టుల ఏర్పాటుతో అడుగడుగునా అభివృద్ధి చూపించింది జగనన్నే అని చెప్పుకునేందుకు గర్వపడుతున్నామన్నారు. ప్రజలంతా జగనన్న పక్షాన ఉన్నారని సిద్ధం సభల ద్వారా నిరూపితమవుతోందన్నారు. ఈ దెబ్బతో కూటమి ఆశలు ఆవిరయ్యాయని ఆమె ఎద్దేవా చేశారు.

మట్టిని రక్షించండి

బీచ్ రోడ్డు: మట్టిని రక్షించండి.. భవిష్యత్తు తరాలను కాపాడండి.. అంటూ ఇషా ఫౌండేషన్ వలంటీర్ సుబ్రహ్మణ్యం సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ ఎర్త్ డే సందర్భంగా బీచ్ రోడ్డులో సేవ్ సోయల్ పేరిట రన్నింగ్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ్ సోయల్ పేరుతో రోజుకు 22 కిలోమీటర్లు పరుగెడుతున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు 4,243 కిలోమీటర్ల మేర విశాఖ పరిధిలో రన్నింగ్ చేశానన్నారు. మట్టిలో ఉన్న సారవంతమైన గుణాలను కాపాడేలా ప్రజలకు అవగాహన కల్పించేందుకు సద్గురు 27 దేశాల్లో 30 వేల కిలోమీటర్ల బైక్ రైడ్ నిర్వహించారని తెలిపారు. సద్గురు స్ఫూర్తితో తాను ఈ రన్నింగ్‌ను కొనసాగిస్తున్నానన్నారు.

మారిన వేళల్లో స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : ఇటీవల ప్రయాణికుల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన విశాఖపట్నం – బెంగళూరు సమ్మర్ స్పెషల్ రైళ్ల వేళలు మారాయని, ప్రయాణికులు మార్పులు గమనించాలని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం – ఎస్ఎంవీ బెంగళూరు (08549) ప్రతీ శనివారం విశాఖలో మధ్యాహ్నం 1.15 గంటలకు బయల్దేరి, మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 29 వరకు నడుస్తుంది. ఎస్ఎంవీ బెంగళూరు – విశాఖపట్నం (08550) ప్రతీ ఆదివారం ఉదయం 8.50 గంటలకు బెంగళూరులో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 3.10 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 30 వరకు నడుస్తుంది. ఈ రైళ్లు ఇరు మార్గాల్లో దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడ్, జోలారోపేట, కృష్ణరాజపురం స్టేషన్లలో ఆగుతాయి.

ప్రచారంలో పాల్గొన్న విమ్స్ ఉద్యోగి తొలగింపు

ఆరిలోవ: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి టీడీపీ ప్రచారంలో పాల్గొన్న విమ్స్ ఉద్యోగి నూకరాజును విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెల 16న జీవీఎంసీ 13వ వార్డు భగత్‌సింగ్‌నగర్‌లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి నిర్వహించిన ప్రచారంలో అదే వార్డుకు చెందిన విమ్స్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి పి.నూకరాజు పాల్గొన్నాడు. దీనిపై ఎన్నికల విభాగం అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై జాయింట్ కలెక్టర్, తూర్పు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.మయూర్ అశోక్ దర్యాప్తు చేపట్టారు. నూకరాజు ప్రచారంలో పాల్గొన్నట్టు నిర్ధారించి ఉద్యోగం నుంచి తొలగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్టు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు.

బొగ్గు రవాణా నిలిచిపోవడంపై హైకోర్టులో కేసు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు అదానీ గంగవరం పోర్టు నుంచి బొగ్గు రవాణా నిలిచిపోవడంపై తగిన చర్యలు తీసుకోవాలంటూ ఉక్కు అధికారుల సంఘం (సీ) రాష్ట్ర హైకోర్టులో కేసు వేసింది. గంగవరం పోర్టులో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన కోకింగ్ కోల్, లైమ్‌స్టోన్‌లు సుమారు 3 లక్షల టన్నులు ఉన్నాయి. ఈ నెల 12 నుంచి పోర్టు కార్మికుల ఆందోళన వల్ల వాటి రవాణా నిలిచి పోయింది. తద్వారా ప్లాంట్ ఉత్పత్తికి తీవ్ర అంతరాయం కలిగింది. అదే విధంగా కోక్ ఓవెన్ బ్యాటరీలు ప్రమాదపు అంచులకు చేరుకున్నాయి. రవాణా నిలిచిపోవడంపై ఉక్కు యాజమాన్యం, అన్ని సంఘాలు జిల్లా కలెక్టర్, కమిషనర్, ఎంపీల దృష్టికి తేవడం జరిగింది. అయినా ఎటువంటి పురోగతి కనిపించటం లేదు. గంగవరం పోర్టును సత్వరం రవాణా చేసేలా చర్యలు తీసుకోవాలంటూ కేసు వేశారు. దీనిపై కోర్టు స్పందిస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి, జిల్లా కలెక్టర్, గంగవరం పోర్టుకు నోటీసులు జారీ చేసింది. బుధవారం కేసు విచారణ జరగనున్నదని ఉక్కు అధికారుల సంఘం ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్ తెలిపారు.

ఆధునిక వ్యవసాయ విధానంతో మెరుగైన ఫలితాలు

మహారాణిపేట : అందుబాటులో ఉన్న ఆధునిక వ్యవసాయ విధానాలను ఉపయోగించుకుని రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని ఆచార్య ఎన్.జి. రంగా విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు ఎల్. ప్రశాంతి అన్నారు. ఉత్తర కోస్తా మండల పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశం విశాఖ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఉత్తర కోస్తా మండలంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అనకాపల్లితో పాటు నాలుగు వ్యవసాయ పరిశోధనా స్థానాలు, నాలుగు విస్తరణ కేంద్రాలు రైతులకు సేవలందిస్తున్నాయన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అనకాపల్లి అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పి.వి.కె. జగన్నాథరావు ఉత్తర కోస్తా మండలంలో 2023- 24 సంవత్సరంలో జరిగిన పరిశోధన, విస్తరణ ప్రగతి గురించి వివరించారు. విస్తరణ సంచాలకులు కె.ఎస్.ఎస్. నాయక్ మాట్లాడుతూ ఏరువాక కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రాలు డ్రోన్ టెక్నాలజీ, మైక్రో ఇరిగేషన్ అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాయన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ప్రతినిధి బాలునాయక్ మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం అందజేసే సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ఉపయుక్తమన్నారు. ఈ కార్యక్రమం మంగళవారం కూడా కొనసాగుతుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సంచాలకులు డాక్టర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంఎఫ్ఆర్ఏ డైరెక్టర్ డాక్టర్ జో కిజకుడన్, ఉత్తర కోస్తా మండలంలోని వ్యవసాయ శాఖ డీఏవోలు, ఉద్యానవన శాఖ అధికారులు, నాబార్డ్ అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు, ఆత్మ అధికారులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పదిలో శశి విద్యార్థుల ప్రతిభ



వి.ప్రణతి, సాయి హన్షిత, హనుమ అఖిల్, శ్రీదుర్గా హర్షిత



కె.జ్ఞానామృత

తగరపువలస: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో సంగివలస క్యాంపస్ విద్యార్థులు ప్రతిభ చూపారని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. 600 మార్కులకు గాను వి.ప్రణతి 594, సీహెచ్ సాయి హన్షిత, ఎస్. హనుమ అఖిల్, వి.శ్రీదుర్గా హర్షిత, కె.జ్ఞానామృత 593 మార్కులు సాధించారని తెలిపారు. 590కు పైగా 8 మంది, 580కు పైగా 77, 570కు పైగా 146, 550కు పైగా 238, 331 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులతో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, డైరెక్టర్ మేకా క్రాంతిసుధ అభినందించారు.

సొమ్ములిచ్చి.. జనాన్ని తెచ్చి..

- డబ్బులు వెదజల్లిన టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి భరత్
- ప్రజలు తరలించేందుకు అష్టకష్టాలు పడ్డ ఆ పార్టీ నేతలు
- మధ్యలో వెనుదిరిగిన విష్ణుకుమార్ రాజు

మహారాణిపేట: టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ నామినేషన్‌కే రూ.లక్షలు కుమ్మరించారు. క్షేత్రస్థాయిలో బలం లేనప్పటికీ.. మేకపోతు గాంభీర్యం ప్రదర్శించి అట్టహాసంగా నామినేషన్‌కు వెళ్లి దాఖలు చేయాలని శ్రీ భరత్ నిర్ణయించారు. ఇందుకోసం భారీగా జన సమీకరణ చేపట్టాలని స్థానిక నేతలకు హుకుం జారీ చేశారు. ఒక్కో వార్డు నుంచి కనీసం 2 వేల మందిని తరలించాలని ఆదేశించారు. దీంతో జన సమీకరణకు టీడీపీ నేతలు అష్టకష్టాలు పడ్డారు. ఎంవీపీలో ఉన్న శ్రీభరత్ పార్టీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లాలని నిర్ణయించడంతో జనాలు వచ్చేందుకు నిరాకరించారు. అంతదూరం ఎండలో రాలేమంటూ వెనకడుగు వేశారు.

రూ.లక్షల కుమ్మరింపు

జన సమీకరణ కష్టమవడంతో భారీగా డబ్బు ముట్టజెప్పాలన్న నిర్ణయానికి వచ్చారు. ఏడు నియోజకవర్గాల నుంచి జనాన్ని సమీకరించారు. బైక్‌కు రూ.500, ఆటోకు రూ.800, మనిషికి రూ.400 ఇలా రూ.లక్షలు కుమ్మరించారు. లాసన్స్ బే కాలనీ నుంచి కలెక్టరేట్ వరకు బైక్‌లు, ఆటోలతో ర్యాలీగా వెళ్లారు. అయితే కొంత మంది మధ్యలోనే వెనుదిరిగారు. గంటల తరబడి ర్యాలీగా వెళ్లాలని భావించినప్పటికీ.. జనాలు వెళ్లిపోతుండడంతో హడావుడిగా, వేగంగా కలెక్టరేట్‌కు భరత్ చేరుకున్నారు. అప్పటికే సగం కంటే ఎక్కువ జనాలు వెనక్కి వెళ్లిపోయారు. శ్రీభరత్ నామినేషన్ కార్యక్రమానికి విశాఖ ఉత్తర బీజేపీ అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు సగం వరకు మాత్రమే వచ్చి.. నామినేషన్ సమయంలో లేకపోవడం గమనార్హం. టీడీపీ నుంచి తగిన ప్రాధాన్యం లభించకపోవడంతో ఆయన మధ్యలోనే వెనుదిరిగినట్లు తెలిసింది. ఒక వైపు కూటమి పార్టీలన్నీ ఏకతాటిపైనే ఉన్నాయని బయటకు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ప్రభావం ఎన్నికల్లో కచ్చితంగా ఉంటుందని ఆ పార్టీల్లోనే చర్చ జరుగుతోంది.

గోపాలపట్నంలో కారు దగ్ధం



మంటల్లో చిక్కుకున్న కారు

గోపాలపట్నం: గోపాలపట్నం పెట్రోల్ బంక్ సమీపంలో ఓ కారులో మంటలు వ్యాపించాయి. సోమవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. గాజువాక నుంచి పెందుర్తి వెళుతుండగా గోపాలపట్నం పెట్రోల్ బంక్ దాటిన తరువాత బోనెట్ నుంచి మంటలు వ్యాపించాయి. మంటలు ఆపేందుకు కారు యజమాని సాయికుమార్ ప్రయత్నం విఫలమైంది. దీంతో పెట్రోల్ బంక్‌లో ఫైర్ ఎగ్జాస్టర్ ద్వారా మంటలను ఆపేందుకు యతి్నంచారు. ఆ ప్రయత్నం విఫలం కావడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించారు. కేవలం 15 నిమిషాల్లో కారు మొత్తం దగ్ధమైంది. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. పెందుర్తి జెఎన్ఎన్ఆర్ఎమ్ కాలనీలో నివాసముంటున్న సాయికుమార్ తన కారును ఏడాది కాలంగా హెచ్‌పీసీఎల్‌కు ఎంగేజ్‌కు పెట్టాడు. కాల పరిమితి తీరడంతో మూడు రోజుల క్రితం కారును తీసుకొస్తుండగా మరమ్మతులకు గురైంది. ఆ ప్రాంతంలో ఉన్న మెకానిక్ షెడ్‌లో మరమ్మతులు పూర్తి కావడంతో సోమవారం కారు తీసుకొస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

28, 29 తేదీల్లో విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టోర్నీ

విశాఖ స్పోర్ట్స్: విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టోర్నీ బ్రోచర్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 28, 29 తేదీల్లో వైఎస్సార్ స్టేడియంలో ఈ టోర్నీ జరగనుందని ఆయన తెలిపారు. మ్యాచ్‌ల నిర్వాహణకు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.